జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 19 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 8

# జడ్జి నాగేశ్వరరావుకు జాతీయ స్థాయి గుర్తింపు

- న్యాయ పరిశోధనకు ఉన్నత న్యాయ స్థానాల ప్రశంసలు
- హైకోర్టు న్యాయ మూర్తి చేతుల మీదుగా ఘన సన్మానం
- భద్రాచలం కు గర్వకారణం



**భద్రాచలం, ఏప్రిల్ 18, ప్రజా జ్యోతి:** భద్రాచలం ప్రాంతానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి నాగేశ్వర రావుకు జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది. హైకోర్టు న్యాయ మూర్తి, జగిత్యాల జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి రేణుక యేరా చేతుల మీదుగా

మిగతా 2 లో...

- జిల్లా ఎస్పీ సారథ్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- వేగం కాదు... ప్రాణమే ముఖ్యమనే సందేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని విస్తృత చైతన్యం
- అవగాహనతో పాటు కఠిన చర్యలతో ప్రమాదాలకు చెక్
- ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమవుతున్న పోలీసుల ప్రయత్నం



3 లో..

# భద్రత బాటలో భద్రాద్రి

వేగవంతమైన జీవనశైలి, పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై చైతన్యం కల్పించడం అత్యవసరంగా మారింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని "సురక్షితంగా ప్రయాణించి సురక్షితంగా చేరుకోవాలి" అనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో సమర్థవంతంగా, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతోంది. వేగమే లక్ష్యం కాకుండా ప్రాణ భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటే దిశగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (భూక్యా రంజిత్ నాయక్), ప్రజాజ్యోతి

# అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటిడిఎ పిఓ రాహుల్



**చర్ల, ఏప్రిల్ 18: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం తేగడ గ్రామపంచాయతీ రైతు వేదిక లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ పోషణ అభియాన్ పథకంలో అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ, గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతల కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా

మిగతా 2 లో...



## పోలవరం ప్రభావం

# భద్రాద్రిలో పెరుగుతున్న భయం భయం

- భద్రాచలం సహా పలుచోట్ల ముంపు ముప్పు తీవ్రం
- కరకట్ట బలహీనతపై నిపుణుల హెచ్చరికలు
- ఐదు పంచాయతీల డిమాండ్ మళ్లీ ముందుకు
- కేంద్ర–రాష్ట్రాలపై బాధ్యతల ప్రశ్న
- పట్టణ భవిష్యత్తుపై ప్రజల్లో ఆందోళన

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18, ప్రజా జ్యోతి :** గోదావరి తీరాన ఆధ్యాత్మిక వైభవంతో వెలసిన భద్రాచలం నేడు అనిశ్చితి అంచుల్లో నిలిచింది. 2023లో నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం, గోదావరికి స్వల్ప వరద వచ్చినా భద్రాచలం సహా దుమ్ముగూడెం, అశ్వాపురం, చర్ల,

మిగతా 2 లో...



## జడ్జి నాగేశ్వరరావుకు జాతీయ స్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి...)

ఆయనకు లాంఛనంగా సన్మానం నిర్వహించారు. న్యాయ పరిశోధన రంగంలో నాగేశ్వరరావు చేసిన కృషి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ఆయ న రూపొందించిన విధానపరమైన విశ్లేషణలను సుప్రీంకోర్టు, అలహాబాద్ హైకోర్టు వంటి ఉన్నత న్యాయస్థానాలు ప్రామాణికంగా ఉదహరించడం విశేషంగా నిలిచింది. ఒక విచారణ స్థాయి న్యాయమూర్తి పరిశోధనకు ఈ స్థాయి గుర్తింపు లభించడం అరుదైన ఘనతగా భావిస్తున్నారు. పోలీసు దర్యాప్తు విధానాలు, న్యాయ ప్రక్రియలో పాటించాల్సిన రక్షణా విధానాలపై నాగేశ్వరరావు చేసిన లోతైన అధ్యయనం న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తోంది. న్యాయపరమైన పారదర్శకత, న్యాయం అందుబాటులోకి రావడంలో ఈ పరిశోధన కీలక పాత్ర పోషిస్తున్నదని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హైకోర్టు న్యాయ మూర్తి రేణుక యేరా మాట్లాడుతూ, నాగేశ్వరరావు మేధస్సు, కృషి, నిబద్ధత న్యాయవ్యవస్థకు విలువైన సేవలని పేర్కొన్నారు. మంథనిలో ప్రథమ శ్రేణి న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఆయన పరిశోధన, నేటికీ కొనసాగుతూ న్యాయరంగానికి దిశానిర్దేశం చేస్తోందని తెలిపారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ స్పందిస్తూ, భద్రాచలం ప్రాంతానికి చెందిన న్యాయమూర్తికి ఇలాంటి జాతీయ గుర్తింపు లభించడం గర్వకారణమని అన్నారు. ఈ విజయం యువ న్యాయాధికారులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. మెట్‌పల్లి, భద్రాచలం న్యాయవాద సంఘాల సభ్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి గుర్తింపులు జిల్లా న్యాయవ్యవస్థ ప్రతిష్టను మరింత పెంచుతాయని, భవిష్యత్తులో కూడా నాగేశ్వరరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నాగేశ్వరరావు సాధించిన ఈ ఘనత యువ న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. అంకితభావంతో చేసిన పరిశోధన, క్రమశిక్షణతో చేసిన సేవలు ఉన్నత స్థాయిలో గుర్తింపును తెచ్చిపెడతాయని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

## అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ



(మొదటి పేజీ తరువాయి...)

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటిడిఎ పిఓ రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మొబైల్, ఫాస్ట్ ఫుడ్లకు పిల్లలు దూరంగా ఉండేందుకు అధికారులు సూచనలతో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను చేర్చడం అత్యంత అవసరమని అన్నారు. చిరుధాన్యాల్లో విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండి పిల్లల ఎదుగుదలకు, రక్తవృద్ధికి, రోగనిరోధక శక్తి పెంపుకు ఎంతో సహాయపడతాయని తెలిపారు. చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉంచాలని, చిప్స్, కురుకురే వంటి పదార్థాల బదులు శనగలు, పప్పులు, పల్లీలు, పండ్లు వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్ వినియోగం తగ్గించి ఇంట్లో తయారు చేసిన సహజ ఆహారాన్ని మాత్రమే పిల్లలకు ఇవ్వాలని తెలిపారు. చిన్నారులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి బయట ఆడుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.పిల్లలకు సమయానికి టీకాలు వేయించడం తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం ద్వారా వారి మేధస్సు వ్యక్తిత్వ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదని సూచించారు. గర్భిణీ స్త్రీలు లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయించడం చట్టవిరుద్ధమని, ప్రతి బిడ్డకు ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించి, బేటి బచావో బేటి పడావో కిట్లు పంపిణీ చేశారు. అలాగే అంగనవాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీవో ఈదయ్య , తేగడ సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ ,ఐసిడిఎస్ అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో పెరుగుతున్న భయం భయం

(మొదటి పేజీ తరువాయి...)

మణుగూరు, పినపాక, వాజేడు, ఏటూరు నాగారం వరకు ముంపు ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరికలు వెలువడ్డాయి.



### »» ప్రత్యామ్నాయాలు పక్కనబెట్టి ప్రమాదకర రూపకల్పన

పోలవరం ప్రాజెక్టు లక్ష్యాలపై ఎవరికీ అభ్యంతరం లేకపోయినా, తక్కువ నష్టంతో సాధ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత రూపకల్పన భారీ విధ్వంసానికి దారితీసే అవకాశం ఉందని నిపుణులు గతంలోనే హెచ్చరించినా, వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### »» భద్రాచలం ఉనికి సంక్షోభంలో

సరిహద్దు మార్పులతో పట్టణ విస్తరణకు స్థలం లేకుండా చేయడం భద్రాచలం అభివృద్ధిని నిలిపేసింది. దేవస్థాన భూములే సరిహద్దు అవతలికి వెళ్లడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఎదగాల్సిన పట్టణం భూభాగం కొరతతో ఆ అవకాశాన్ని కోల్పోయింది.

### »» కేంద్ర–రాష్ట్రాల బాధ్యతలపై ప్రశ్నలు

జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం వల్ల కలిగే నష్టాలకు కేంద్రం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రకటించిన నిధుల వినియోగంపై స్పష్టత అవసరం.

### »» ఐదు పంచాయతీల డిమాండ్ మళ్లీ ముందుకు

భద్రాచలం అభివృద్ధికి భూభాగం పెంపు అత్యవసరంగా మారింది. ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలన్న డిమాండ్ మళ్లీ జోరందుకుంది. దీనిపై చట్టబద్ధ చర్యలు తీసుకుంటేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

### »» ప్రజా ఉద్యమాలే మార్గమా?

భద్రాచలం సమస్యల పరిష్కారానికి రాజకీయ చర్చలు మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాల అవసరం ఉందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. గతంలో జరిగిన పోరాటాలే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు.

### »» తక్షణ చర్యలే భవిష్యత్తుకు బాట

భద్రాచలం సమస్య కేవలం ఒక పట్టణానికే పరిమితం కాదు. ప్రజల భద్రత, ప్రాంతీయ అభివృద్ధి, ఆధ్యాత్మిక వారసత్వం అన్ని కలిసి ఈ అంశాన్ని అత్యంత కీలకంగా మారుస్తున్నాయి. తక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తు మరింత సంక్లిష్టమవుతుందని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు

## డిసిసి లో మండలం నుంచి ముగురికి చోటు

- డిసిసి ఉపాధ్యక్షుడిగా తాండ్ర ప్రభాకర్







**ములకలపల్లి, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి లో ములకలపల్లి మండలం నుంచి ముగ్గురికి చోటులభించింది. . డిసిసి ఉపాధ్యక్షుడిగా ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తాండ్ర ప్రభాకర్ ను నియమించగా, కార్యదర్శిగా అనుమోలు నర్సింహారావు, కార్యనిర్వాహక సభ్యులు గా సీనియర్ నాయకులు పాలకుర్తి రత్న భూషణం కు జిల్లా కమిటీలో చోటు లభించినట్లు శనివారం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. మండలం నుంచి ముగ్గురికి చోటు కల్పించడం పై పలువురు పార్టీ నాయకులు ,కార్యకర్తలు, హర్షం వ్యక్తం చేశారు.

## దాస్ తండా అంగన్వాడి సెంటర్లో పోషణ పక్వాడ్



**టేకులపల్లి,ఏప్రిల్18,ప్రజాజ్యోతి:** మండలం దాసుతండా గ్రామపంచాయతీ దాసుతండ అంగన్వాడి సెంటర్ సెక్టార్ సూపర్వైజర్ అనురాధ అధ్యర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సూపర్వైజర్ అనురాధ మాట్లాడుతూ 0–6 సంవత్సరాల పిల్లల పోషణ ఆరోగ్యం,అభివృద్ధి మెరుగుపరచడం తల్లిదండ్రులు ముఖ్యంగా తండ్రులు,సంరక్షకులు పిల్లల ఎదుగుదలలో చురుకుగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమానికి దాస్ తండా సర్పంచ్ భూక్యా చందర్ సింగ్ హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ పోషకాహారం విలువల గురించి వివరించారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ కళ్యాణి మాట్లాడుతూ బాలల హక్కులు చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, అక్రమ దత్తత, బడి బయట బాలలు,బాలల పరిరక్షణ కమిటీల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం బలరాం,అంగన్వాడీ టీచర్స్ మల్లీశ్వరి, జ్యోతి, మంగమ్మ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్కల అక్షర జ్ఞాపకార్థం యాచకులకు భోజన ప్యాకెట్ల పంపిణీ



**కొత్తగూడెం, ఏప్రిల్ 18 ( ప్రజాజ్యోతి )** యువతి అక్కల అక్షర జ్ఞాపకార్థంగా తల్లిదండ్రులు వినయ్ కుమార్, నాగలక్ష్మీల సహకారంతో కొయ్యడ రాజ్యలక్ష్మి, నిరుకొండ మాలతి ఆధ్వర్యంలో సూపర్ బజారు, కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాచకులకు, నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజ్యలక్ష్మి, మాలతి లు మాట్లాడుతూ సమాజంలో ఉన్న పేదలు, అనాధలు ఆకలితో బాధపడకుండా చేయాలనే ఉద్దేశంతో తమవంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అక్కల అక్షర జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ అన్నదానం ద్వారా సేవా భావాన్ని చాటుకున్నామని పేర్కొన్నారు. భోజన ప్యాకెట్లు అందుకున్న యాచకులు, ప్రయాణికులు నిర్వాహకుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య తల్లిదండ్రులు సంఘం జిల్లా ట్రెజరర్ నయీమ్, లక్ష్మీదేవిపల్లి మండలం అధ్యక్షుడు రాజేష్ రాజ్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. స్థానికులు, స్వచ్ఛంద సేవకులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.





# భద్రత బాటలో భద్రాద్రి

- జిల్లా ఎస్పీ సారథ్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- వేగం కాదు... ప్రాణమే ముఖ్యమనే సందేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని విస్తృత చైతన్యం
- అవగాహనతో పాటు కఠిన చర్యలతో ప్రమాదాలకు చెక్
- ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమవుతున్న పోలీసుల ప్రయత్నం

**వేగవంతమైన జీవనశైలి, పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై చైతన్యం కల్పించడం అత్యవసరంగా మారింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని "సురక్షితంగా ప్రయాణించి సురక్షితంగా చేరుకోవాలి" అనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో సమర్థవంతంగా, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతోంది. వేగమే లక్ష్యం కాకుండా ప్రాణ భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటే దిశగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (భూక్యా రంజిత్ నాయక్), ప్రజాజ్యోతి



వేగం పెరిగిన కాలంలో ప్రాణ భద్రతే ప్రధానం అన్న సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రజల జీవన విధానంలో సానుకూల మార్పులకు దారితీస్తోంది. జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్న సంకల్పంతో ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయిస్తున్నారు. ప్రమాదాల మూలాలను గుర్తించి, వాటి నివారణపై దృష్టి సారించడం ఆయన విధానంలో ప్రధానంగా కనిపిస్తోంది.

### »» ఎస్పీ పర్యవేక్షణలో సమగ్ర అమలు

జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా జరుగుతున్నాయా అన్నదాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తూ, అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి వర్గానికీ చేరేలా కార్యాచరణ రూపొందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది.

### »» యువతపై ప్రత్యేక దృష్టి.





రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతే బలి అవుతున్న నేపథ్యంలో, విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న దిశగా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను 'రోడ్ సేఫ్టీ అంబాసిడర్లుగా' తీర్చిదిద్దుతూ, వారి ద్వారా సమాజంలో చైతన్యం విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు.

### »» అవగాహనతో పాటు కఠిన చర్యలు.

హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, మద్యం సేవించి డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. చలాన్లు విధించడం ద్వారా క్రమశిక్షణను పెంపొందిస్తున్నారు.

### »» ప్రజల భాగస్వామ్యమే విజయ రహస్యం

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల సహకారం అత్యంత కీలకమని ఎస్పీ రోహిత్ రాజు పలుమార్లు స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రజలను ప్రోత్సహిస్తూ, బాధ్యతాయుత డ్రైవింగ్ సంస్కృతిని నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

### »» వేగం కాదు... ప్రాణమే ముఖ్యం

సురక్షితంగా ప్రయాణించి సురక్షితంగా చేరుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశాన్ని జిల్లా వ్యాప్తంగా బలంగా వినిపించేలా



చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తానికి, ఎస్పీ రోహిత్ రాజు నాయకత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు భద్రతపై ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోంది. పోలీసుల కృషి, ప్రజల సహకారం కలిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం మరింత బలపరుస్తోంది.







## నాగారం జగన్నాథపురం సబ్ స్టేషన్లలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు

- ఓల్టేజ్ సమస్య నుండి రైతులకు ఊరట



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 18 ,(ప్రజా జ్యోతి)** సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగం గా రైతులకు లో వాల్టేజ్ సమస్య తీర్చేందుకు నూతనంగా పాల్వంచ మండల పరిధిలోని జగన్నాథపురం సబ్స్టేషన్ లో అదనంగా 3.1 మెగావాట్ల పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఎస్ ఈ మహేందర్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వోల్టేజి సమస్యతో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల పరిధిలోని రెండు సబ్ స్టేషన్లలో అదనంగా ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు, మండలంలోని నాగారం సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు లో వాల్టేజ్ సమస్య తీర్చేందుకు 3.1 అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, నేటి నుండి రైతులకు ఓల్టేజీ సమస్య ఉండదన్నారు, ఈ కార్యక్రమంకీ ఎం.ఆర్.టి. డి.ఈ వెంకటేశ్వర్లు, ఆపరేషన్ డి ఈ నందయ్య .. పాల్వంచ ఏ డి ఈ హుస్సేన్ . ఎం.ఆర్.టి ఏ డి ఈ రాంబాబు .ఏ ఈ రవీందర్ , సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై ఈ నెల 20న మహాసభ




**కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు తెలంగాణ ఎన్.ఎస్.యు.ఐ విద్యార్థి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ హాజరవుతారని చెప్పారు. విద్యార్థుల సమస్యలు, ఫీజుల పెంపు, నిరుద్యోగం వంటి అంశాలపై సమ్మేళనంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్యా దివాకర్, మాలిక్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి పవర్ లిఫ్టర్‌లను అభినందించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 17 ,ప్రజాజ్యోతి,** భద్రాచలంకు చెందిన పవర్ లిఫ్టర్‌లు మోడెం వంశీ, డీవీ శంకర్‌రావులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ పవర్ లిఫ్టర్‌లు మోడెం వంశీ, డీవీ శంకర్‌రా వులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి మల్లేష్ గారు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జివి రామిరెడ్డి, జిల్లా కోశాధికారి, మహంతి వెంకటకృష్ణాజి పాల్గొన్నారు.

# ఐక్యతకు ప్రతీకగా నిలిచేదే హిందూ సమ్మేళనం

- ఈ నెల 26న కొత్తగూడెంలో భారీగా హిందూ సమ్మేళన సభ
- కొత్తగూడెంలో హిందూ జాతర వాతావరణం
- 15 వేల మందితో ఐక్యత గర్జనకు సన్నాహాలు



**కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియం హిందూ ఐక్యతకు వేదిక కానుంది. ఈ నెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్న హిందూ సమ్మేళనం బహిరంగ సభను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. సుమారు 15 వేల మందికి పైగా పాల్గొనేలా విస్తృత ప్రణాళికతో కార్యక్రమాన్ని రూపుదిద్దుతున్నట్లు హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.వి. వర్ధన్ రావు, కార్యదర్శి జగన్మోహన్ వెల్లడించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సభను హిందూ ఐక్యతకు ప్రతీకగా నిలిపేలా ప్రత్యేకంగా రూపొందిస్తున్నామని తెలిపారు. సభకు ముందుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ లక్ష్మీదేవిపల్లి మండలం మొర్రేడు వాగు సమీపంలోని హనుమాన్ దేవాలయం వరకు ఉత్సాహభరితంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువత, భక్తులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తగూడెం వేదికగా ప్రకాశం స్టేడియంలో జరిగే బహిరంగ సభను హనుమాన్ చాలీసాతో ప్రారంభించి, భక్తి, దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సభలో పాల్గొని హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణపై ప్రసంగించనున్నారని వెల్లడించారు. కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల నుంచి రాజకీయాలకు అతీతంగా హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సమాజంలో పరస్పర సహకారం, ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఈ సమ్మేళనం వేదిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానికంగా విస్తృత స్థాయిలో ప్రచారం, ఏర్పాట్లు కొనసాగుతున్నాయని సభ ప్రాంగణంలో భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పూర్ణ, లక్ష్మణ్, బండి భాస్కర్, సాంబశివరావు, పిల్లి రాజేశ్వరావు, పంచార్య, దారా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పరిధిలో చలివేంద్రాల ఏర్పాటు




**కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి)** వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను మేయర్ మూడ్ గణేష్ ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో బస్టాండ్, రైల్వే స్టేషన్, కూరగాయల మార్కెట్ తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## రామాలయం తూర్పుమెట్లవైపు ఉన్న దుకాణాల కూల్చివేత



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 18 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం తూర్పు వైపు ఉన్న ఐదు దుకాణాలను శనివారం భద్రాద్రి దేవస్థానం, రెవిన్యూ, పంచాయతీ అధికారులు తొలగించారు. వచ్చే నెల నుంచి రామాలయం అభివృద్ధి పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ కూల్చివేతలను అధికారులు చేపట్టారు. కాగా తమకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అప్పటికప్పుడు అధికారులు వచ్చి మూకుమ్మడిగా, కనీసం సామాన్లు సైతం బయటకు తరలించుకునే సమయం ఇవ్వకుండా జేసీబీతో కూల్చివేయడంపై దుకాణదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారులు కొందరు తమ వద్ద అనుమతి పత్రాలు ఉన్నాయని, ఒక షాపుకు సంబంధించి రిజిష్ట్రేషన్ కూడా ఉందని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా దుకాణాలను బలవంతంగా తొలగించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో అడ్డగోలు కూల్చివేతలు సరికాదని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని వ్యాపారులు మండిపడుతున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్మానించిన కౌన్సిలర్



**ఇల్లందు, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి:** ఇటీవల జరిగిన ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఘనవిజయం సాధించిన భూక్య రవికుమార్ నాయక్ ను శనివారం 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. రవికుమార్ నాయక్ లాయర్ వృత్తిలో మరింతగా రాణించాలని కోరారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

- రామయ్యను దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్





**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 18 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సమయంలో ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చివరగా దేవస్థానం వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

# మా గ్రామం మీదే ఎందుకు వివక్షత?

- ప్రమాదకరంగా మారిన కరెంటు స్తంభం
- ఒరిగిన స్తంభం సరి చేసేది ఎప్పుడు?
- సుజాతనగర్ హరిజన వాడలో ప్రమాద ఘంటి కలు
- శిధిలావస్థలో ఇనుప స్తంభాలు అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
- ఈదురు గాలులతో ఎప్పుడు పడిపోతుందో నని భయం



**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 18:** సుజాతనగర్ పరిధిలోని హరిజనవాడ గ్రామంలో పురాతన కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రాణహాని ముప్పుగా మారాయి. ముఖ్యంగా ఒక స్తంభం పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా నిలిచి ఉండటం గ్రామస్తులను భయాందోళనలకు గురిచేస్తోంది.గ్రామంలో కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఇనుప స్తంభాలు కాల క్రమేణా బలహీనమై ఇప్పుడు కూలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమయంలో సమీప గ్రామాల్లో ఇలాంటి పాత ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసిన అధికారులు, హరిజన వాడ విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మా గ్రామం మీదే ఎందుకు వివక్షత అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఒరిగి ఉన్న స్తంభం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాబోయే ఎండాకాలంలో బలమైన ఈదురు గాలులు వీస్తే ఈ స్తంభం నేలకూలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు చెబుతున్నారు. అలా జరిగితే ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిల్లలు ఆడుకునే ప్రదేశం, ప్రజలు తరచూ వెళ్లే మార్గం దగ్గర ఈ స్తంభం ఉండటం మరింత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయంతో గడుపుతున్నారు.ఈ నేపథ్యంలో గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను వెంటనే స్పందించి ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్రామంలోని అన్ని పాత ఇనుప స్తంభాలను కూడా పరిశీలించి అవసరమైతే మార్పిడి చేయాలని కోరుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అత్యవసరం.సుజాతనగర్ హరిజనవాడలో ఒరిగిన స్తంభం సమస్య కేవలం ఒక నిర్మాణ సమస్య మాత్రమే కాదు ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యవసర అంశం. అధికారులు ఇప్పటికైనా మేల్కొని వెంటనే చర్యలు తీసుకుంటేనే పెద్ద ప్రమాదాన్ని నివారించవచ్చు.

## శిశు విహార్ పరిసరాల్లో పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు

- భద్రాచలం ప్రధమశ్రేణి న్యాయాధికారి శివనాయక్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డులో ఉన్న శిశు విహార్ పరిసరాల్లో పరిశుభ్రతపై గ్రామ పంచాయతీ , చైల్డ్ వెల్ఫేర్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని పరిసరాల్లో ఉన్న పండ్ల దుకాణాల నిర్వాహకులపై అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ప్రధమ శ్రేణి న్యాయాధికారి శివనాయక్ అన్నారు. శనివారం ఆయన శిశువిహార్ ప్రవేశం పరిసరాల్లో ఫుట్ పాత్‌పై ఉన్న పండ్ల దుకాణదారులు పడేస్తున్న వ్యవర్థాలను, పాడుబడిన బండ్లను పెట్టి ఉంచడాన్ని పరిశీలించారు. ఈ సమయంలో ఆయన గ్రామ పంచాయతీ, ఇతర శాఖల అధికారులను పిలిపించి పరిస్థితిని సమీక్షించారు. చిన్నారులు శ్వాసించే గాలిలోనే దుర్వాసన కలగడం, వ్యాధు లు వ్యాపించే అవకాశాలు పెరగడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత దుకాణ యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండ్ల వ్యర్థాలను రోజువారీగా తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన గట్టిగా హెచ్చరించారు. చిన్నారుల ఆరోగ్యం కంటే ముఖ్యం మరేదీ లేద ని, బాధ్యతారాహిత్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మా సూచనలు పాటించని యజమానులపై గ్రామపంచాయతీ సహకారంతో నిరంతర తనిఖీలు నిర్వహించి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ట్రాఫిక్ నియమాల పాటనతోనే ప్రమాదాల నివారణ

- అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ సూచన





**కొత్తగూడెం, ఏప్రిల్ 18 ( ప్రజాజ్యోతి )** రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలంటే ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ ఆదినారాయణ పేర్కొన్నా రు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన సురక్షితంగా చేరుకోండి – ప్రాణాలతో గమ్యానికి చేరండి( Arrive-Alive ) అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తూ రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణనష్టం నివారించవచ్చని సూచించారు. ట్రాఫిక్ నియమాలపై స్వీయ క్రమశిక్షణతో వ్యవహరించాలని, బాధ్యతగల పౌరులుగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణా తరగతులు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 18,(ప్రజాజ్యోతి )** పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించబడుతున్నాయని కళాశాల ప్రధానాచార్యులు బండి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా మే నెల 13వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షకు సమగ్రంగా సిద్ధం కావడానికి ఈ శిక్షణా తరగతులు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. కావున ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7989103692 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో కాయకల్ప బృందం తనిఖీ




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 18 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం రాష్ట్రస్తాయి కాయకల్ప బృందం క్షేత్రస్తాయి పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణను పరిశీలిచారు. కాయకల్ప రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ రఘు పూజారి, డాక్టర్ జోష్న, శైలజలు ఆసుపత్రిలోని అన్ని వార్డులు, అత్యవసర విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సమయంలో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, సిబ్బంది పని తీరు, వార్డుల నిర్వహణ, పారిశుద్య పద్దతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో అనుసరిస్తున్న పర్యావరణ పరిరక్షణ పద్దతులు, వ్యర్దాల నిర్వహణ వివరాలు సేకరించారు. అనంతరం రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న చికిత్స, ఆసుపత్రిలో సౌకర్యాల గురించి ఆరా తీశారు. సిబ్బందితో కలిసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, సంతోష్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 18 , ప్రజాజ్యోతి,** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఆవరణలో కెరీర్ డెవలప్మెంట్ , ప్లేస్మెంట్ సెల్ , కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు భద్రాచలం పరిసర ప్రాంతాల నుండి 248 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ప్లేస్మెంట్ సెల్ఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాగసమ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని ఆయన అన్నారు. పలు దఫాలుగా జరిగిన ఇంటర్వ్యూల అనంతరం మొత్తం 55 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంపికైన అభ్యర్థులకు పలు సూచనలు ఇస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి జాబ్ మేళాలు ఒక చక్కని వేదికని, ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ రాగ సుమ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ప్రతిష్టాత్మక కంపెనీలతో ఇలాంటి డ్రైవ్ లు నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా కెమిస్ట్రీ విభాగాధిపతి హిమజ జాబులో సెలెక్ట్ అయిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, ప్లేస్మెంట్ సెల్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, ఏప్రిల్ 18:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఫైర్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు.2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల ఒద్దిపేట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అని కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాల ఐనదని ఇచ్చిన హామీలు మర్చిపోయరు అని ఏప్రిల్ మే నెలలో తీవ్రంగా ఎండలు ఉంటాయి చెపుతున్నారు అని అగ్నిప్రమాదలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి కనుక ఫైర్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేసే అవకాశం లేకపోతే ఒక ఫైర్ ఇంజన్ అయినా ఏర్పాటు చేయండి అని అన్నారు . అగ్ని ప్రమాదం జరినపుడు భద్రాచలం నుండి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఇండ్లు ఇంట్లో సామాన్లు బూడదైపోతున్నాయి అని ఇళ్లు కాలిన వారికి ప్రభుత్వం ఏమి సహాయం చేయడం లేదు అని వెయ్యి ,రెండు వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు అని ఇళ్లు కాలిన వారు మళ్ళీ మామూలుగా జీవితం గడపటానికి రెండు మూడు సంవత్సరాలు పడుతుంది అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చి పోయి కాలక్షేపం చేస్తుంది అని అన్నారు. మహిళలను కోటీశ్వరలను చేస్తామని చెప్పారు అని కోటీశ్వరలను సంగతి అలా ఉంచి ఒంటరి మహిళలకు వితంతువులు పెన్షన కోసం ఎదురుచూస్తున్నారు అని అన్నారు .ప్రతి ఇంటిలో ఒక మహిళకు 2500 ఇస్తాము అని హామీ ఇచ్చారు కానీ వాటి కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు అని నిరుద్యోగులకు జీవనోపాధికై లోన్లు ఇస్తామని నిరుద్యోగ భృతి 3600 ఇస్తామని హామీ ఇచ్చారు అని నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక బ్రతుకుతెరువుకు ఎంటు వంటి అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు అని ఇప్పటికైన ఇచ్చిన హామీలను అమలు చేయాలని చర్లకు వెంటనే ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయలని అన్నారు.

## ప్రకాష్ రాజ్ దిష్టిబొమ్మ దగ్ధం





**చర్ల, ఏప్రిల్ 18:( ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం హిందూ దేవతలపై సినీ నటుడు ప్రకాష్‌రాజ్ చేసిన అనుచిత వాఖ్యలపై హిందూ సంఘాలు భగ్గుమన్నాయి. ఇటీవల ప్రకాష్ రాజ్ ఒక సెమినార్ లో హిందువుల ఆరాధ్య దేవతలయిన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడిపై వివాదాస్పద వాఖ్యలు చేసిన విషయం విదితమే. ప్రకాష్ రాజ్ వాఖ్యలకు నిరసనగా చర్లలో సనాతన హిందూ పరిరక్షణ కమిటీ, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆద్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రకాష్ రాజ్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. ఇకపై హిందువులు అతడి సినిమాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు, దర్శకులు ప్రకాష్ రాజ్ కు సినిమా అవకాశాలు ఇవ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు శివరాజు కిషోర్, జవ్వాది మురళీకృష్ణ, మైనేని పద్మజ, మీసాల శ్రీనివాస్, కీర్తి సురేష్, సన్యాసి నాయుడు, ఇరసవడ్ల రాము, సాయి, పామార్ బాలాజి, వేములపల్లి ప్రవీణ్ బాబు, వీరాచారి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి వరి కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వేణు గోపాల్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 18,(ప్రజాజ్యోతి)** యాసంగి 2025-26 ధాన్యం కొనుగోలు పై అదనప కలెక్టర్ వేణుగోపాల్ తన కార్యాలయంలో శనివారం రైస్ మిల్లర్లు, ఎఫ్సీఐ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లాలో సుమారు 83,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, అవసరమైన ధాన్యానికి మాత్రమే కొనుగోలు పత్రాలు, టోకెన్లు జారీ చేయాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు రైతులు తెస్తున్న పి ఆర్-126 వరి రకం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ రకంలో పిన్‌పాయింట్ డ్యామేజ్ సమస్య కారణంగా ఎఫ్‌సీఐ వద్ద బియ్యం ఆమోదం పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలియజేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని ఎఫ్‌సీఐ వద్ద బియ్యం సజావుగా ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థలు రైతులకు తగిన సౌకర్యాలు కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ఉన్న నేపథ్యంలో రైతులు ఎండల సమయంలో కేంద్రాలకు రాకుండా, వాతావరణం చల్లబడిన తర్వాత ధాన్యాన్ని తీసుకురావాలని అవగాహన కల్పించాలని అన్నారు.రైస్ మిల్లర్లు తమ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతికి అవసరమైన హమాలీలు, గోదాం స్థలాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు వరి కొనుగోలు సిబ్బందికి శిక్షణ అందించి, సమన్వయంతో పని చేస్తూ కొనుగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు .ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్య చందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ. ప్రేమ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి త్రినాధ్ బాబు, జిల్లా సహకార అధికారి రాజశేఖర్, ఎఫ్‌సీఐ అధికారులు వెంకట రమణ, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా మహిళా బిల్లు అమలు చేయాలి

- బిజెపి కుట్రలకు ఇండియా కూటమి చెక్.. ఇది ప్రజాస్వామ్య విజయం
- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి ధ్వజం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 18 , ప్రజాజ్యోతి,** పార్లమెంటులో ప్రతిపక్షాల విజయం బిజెపి నియంతృత్వ ధోరణికి చెంపపెట్టు అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం భద్రాచలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం వెనుక బిజెపికి ఒక రహస్య ఎజెండా ఉందని ఆయన విమర్శించారు.

### ››› దక్షిణాదిపై కుట్ర.. హిందూ దేశంగా మార్చే యత్నం

తమకు పట్టున్న ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను పెంచుకుని, శాశ్వతంగా అధికారంలో కొనసాగాలనేది బిజెపి, ఆర్ఎస్ఎస్ పన్నాగమని నర్సారెడ్డి మండిపడ్డారు. లౌకిక భారతదేశాన్ని మతోన్మాద దేశంగా మార్చడమే లక్ష్యంగా ఈ ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ డీలిమిటేషన్ జరిగితే తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో గొంతు ఎత్తే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఎటువంటి నిబంధనలు లేకుండా 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### ››› బిజెపి ఎంపీల మౌనం దుర్మార్గం

తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బిజెపి ఎంపీలు.. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే నోరు మెదపకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరుపై స్పందిస్తూ.. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కంటే బిజెపి ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమా? అని ప్రశ్నించారు.సిపిఐ(ఎం) మొదటి నుంచి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతోందని, డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా బిల్లు తెస్తే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి బిజెపి విధానాలను అడ్డుకోవాలని నర్సారెడ్డి పిలుపునిచ్చారు.

## నూతన ఎమ్మార్వో, ఎంపీడీవోలకు ఉపసర్పంచుల సంఘం సన్మానం





**పినపాక,ఏప్రిల్ 18(ప్రజాజ్యోతి ):** పినపాక మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు గార్లను ఉపసర్పంచుల సంఘం ఘనంగా సన్మానించింది. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాలువాలు కప్పి మర్యాదపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు గడువులోగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు అవసరం లేకుండా బయటకు రాకుండా చూడాలని సూచించారు.ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడమే లక్ష్యమని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు దాట్ల రాజేష్, ఉపాధ్యక్షుడు అచ్చా నవీన్, ప్రధాన కార్యదర్శి కోడం రామ్మోహన్, కోశాధికారి నిట్టా శిరీష, ఆరె స్రవంతి, సహాయ కార్యదర్శి కొమరం ధనలక్ష్మి , అలాగే స్థానిక నాయకులు గంగిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆరె నవీన్, నిట్టా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సక్రమంగా "అక్రమ దందా"

- ఇందిరమ్మ ఇళ్లకు అటవీ 'విరోధం'..
- అటవీ శాఖ అధికారుల "ఆమ్యామ్యాల" పర్వం
- బిట్ ఎవరిది... వచ్చింది ఎవరు....?



**ములకలపల్లి, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి :** పేదవాడి సొంతింటి కలను నిజం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలపై స్థానికఅటవీ శాఖ అధికారులు నీళ్లు చల్లుతున్నారన్న చర్చ మండల వ్యాప్తంగా జోరుగా నడుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుంటూ.. అనుమతుల పేరుతో హంగామా చేస్తూన్న, అసలు లక్ష్యం మాత్రం 'వసూళ్లే'నన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముత్యాలంపాడు నుంచి జగన్నాథపురం వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న ఘటన ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాళ్లు సేకరించుకుని ముత్యాలంపాడు నుంచి జగన్నాథపురం ట్రాక్టర్‌లో తరలిస్తుండగా, ఓ బీట్ అధికారి శనివారం అడ్డుకున్నారు. డి ఆర్ ఓ నాగమణి ఆదేశాలంటూ నానా హంగామా చేసి ట్రాక్టర్‌ను నిలిపివేశారు. రైతులు ఎంత మొత్తుకున్నా వినకుండా, ఇది అటవీ సంపద అంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. అంత హంగామా అనంతరం ట్రాక్టర్ ను వదిలిపెట్టారు. ట్రాక్టర్ వదిలి వేయటానికి నగదు చేతులు మారినట్లు సమాచారం.

ఈ విషయమై డి ఆర్ ఓ నాగమణి ని వివరణ కోరగా "అటవీ ప్రాంతం నుంచి రాళ్లు తెస్తున్నారనే సమాచారంతో ట్రాక్టర్ ను నిలిపి వేయడం జరిగిందని .. ఆ తర్వాత అవి రెవెన్యూ భూమి నుంచి వస్తున్నాయి అని తేలడంతో వదిలేశాం"అని ఆమె వివరణ ఇచ్చారు. ఇదిలావుండగా విచారణ పేరుతో గంటల తరబడి హైడ్రామా నడిపిన అధికారులు, లోపాయికారీగా నగదు చేతులు మారిన తర్వాతే ట్రాక్టర్‌ను వదిలిపెట్టినట్లు సమాచారం. వాస్తవానికి అక్కడ ట్రాక్టర్ లు ఆపింది కూడా సంబంధిత బిట్ అధికారి కాదు అని సమాచారం. ఈ అధికారులు ఒక్కో పనికి ఒకో రేటు నిర్ణయించి భారీగా ఈ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు. ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ములకలపల్లి ఎఫ్ ఆర్ ఓ రవి కిరణ్ ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదు. విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

## సమగ్ర సర్వే డబ్బులేవి?



**టేకులపల్లి,ఏప్రిల్18,ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమ్రగ కుటుంబ ఇంటింటి సర్వే ముగిసి రెండు సంవత్సరాలు గడిచింది. సర్వే చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన పారితోషికాల వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్,పిఆర్టియు టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ మోతిలాల్ నాయక్,టీజీటీటీఎఫ్ మండల అధ్యక్షులు బాదావత్ పూల్ సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముత్యాలం పాడు ఎక్స్ రోడ్ లోని రైతు వేదికలో ఉపాధ్యా యులకు జరుగుతున్న2027 సెన్సస్ విధుల శిక్షణా తరగతులలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో వారు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయులతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయించుకొని వారికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున చెల్లించవలసిన పారితోషికాల రెండు సంవత్సరాలు కావస్తున్న చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 50కోట్ల రూపాయలు మాత్రమే అవుతున్నప్పటికీ వాటిని సర్దుబాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వం చేయడం లేదని వారు ఆరోపించారు.ఇది ప్రభుత్వానికి పెద్ద భారం కాదని,ఉపాధ్యాయ సంఘాలు అనేకసార్లు ప్రాతినిథ్యాలు చేసినప్పటికీ చెల్లిస్తామని చెబుతూ చెల్లించకుండా ఉండడం సరైనది కాదని అన్నారు. వెంటనే చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.వెంకట్ రామ్,యం.మోహన్ రావు, డి.వీరన్న,భిక్షమయ్య,జి.రాంబాబు,బి.సునీత,శ్రీలక్ష్మి,సుభద్ర,రాధ,అంజలి,రామకోటేశ్వరి,సరస్వతి,అబ్బయ్య,సులోచన,వాలమ్మ,వెంకటేశ్వర్లు,బాలు,మున్నా,రాంబాబు, శంకర్,బాలాజీ పాల్గొన్నారు.

# కేసుల నాణ్యత పెంపుతో కన్విక్షన్ రేటు పెంచాలి: ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం హేమచంద్రపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోప్రాసిక్యూషన్ సమీక్ష కమిటీ ( పి.ఆర్.సి ) సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అధ్యక్షత వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, కోర్టు లైజన్ ఆఫీసర్లు,ప్రాసిక్యూషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు. సమావేశంలో గడిచిన ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోర్టుల్లో విచారణకు వచ్చిన కేసులపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కన్విక్షన్ మరియు అక్విటల్ కేసుల పురోగతిని విశ్లేషిస్తూ దర్యాప్తు సమయంలో ఎదురవుతున్న లోపాలు, సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ కేసుల విచారణ వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చార్జ్ షీట్లు సమయానికి దాఖలు చేయాలని, సాక్షుల సమన్లు సకాలంలో అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కోర్టు విచారణల్లో ఆలస్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అదే విధంగా దర్యాప్తు ప్రక్రియలో టెక్నికల్ ఎవిడెన్స్ సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సైంటిఫిక్ మరియు డిజిటల్ ఆధారాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. కేసుల నాణ్యతను మెరుగుపరచడం ద్వారా కన్విక్షన్ రేటును గణనీయంగా పెంచాలని దిశానిర్దేశం చేశారు. భాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీస్ మరియు ప్రాసిక్యూషన్ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి విజయ లక్ష్మి దర్యాప్తు అధికారులకు కేసుల నిర్వహణ, సాక్ష్యాల సమర్పణ, కోర్టు విచారణలో పాటించాల్సిన కీలక అంశాలపై విలువైన సూచనలు అందించారు. మొత్తం మీద ఈ సమావేశం ద్వారా కేసుల దర్యాప్తు మరియు న్యాయపరమైన ప్రక్రియలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు లభించాయని వెల్లడించారు.

## డీసీసీ జనరల్ సెక్రటరీలలో వనమా గాంధీకి చోటు

మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగిన నాయకుడు.. కష్టానికి దక్కిన గుర్తింపు



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీలుగా ఎంపికైన పది మందిలో అన్నపురెడ్డిపల్లి మండలం నుంచి వనమా గాంధీకి చోటు దక్కడం పట్ల మండల ఆర్య వైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదగడం గాంధీ కృషి, నిబద్ధతకు దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. మన ఆర్యవైశ్య ముద్దుబిడ్డకు వచ్చిన ఈ పదవి మండలానికి గర్వకారణమని తెలిపారు. వనమా గాంధీ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ, అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని క్రమశిక్షణతో పని చేస్తూ ముందుకు సాగుతున్న నాయకుడని కొనియాడారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య పార్టీ జెండాను మోస్తూ కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు, గతంలో బాలాజీ వెంకటేశ్వరస్వామి చైర్మన్‌గా కూడా సేవలందించినట్లు గుర్తు చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తూ, ప్రతి కార్యక్రమంలో ముందుండే వ్యక్తిగా గాంధీ మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవి సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు వనమా గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళా బిల్లుకు వ్యతిరేకతపై బీజేపీ మహిళా మోర్చా నిరసన



**కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి)** మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరించిన రాజకీయ పార్టీల చర్యలను ఖండిస్తూ కొత్తగూడెంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, వివిధ వర్గాల మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జీవీకే మనోహర్ మార్గదర్శకత్వంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువచ్చిందని తెలిపారు. కాంగ్రెస్, డీఎంకే వంటి ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరించడం దురదృష్టకరమని విమర్శించారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు తమ మహిళా వ్యతిరేక వైఖరిని మరోసారి బయటపెట్టాయని అన్నారు. మహిళా సాధికారత గురించి బయట మాట్లాడే ఈ పార్టీలు, పార్లమెంట్‌లో మాత్రం మహిళల హక్కులను అణచివేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక బిల్లును అడ్డుకోవడం దేశానికి, మహిళలకు ద్రోహమని పేర్కొన్నారు. అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాలంటే చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అవసరమని చెప్పారు. మహిళల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని, మహిళా సాధికారత సాధించే దిశగా ముందుకు సాగుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాజీ చైర్మన్



**ఇల్లందు, ఏప్రిల్ 18, ప్రజా జ్యోతి:** జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయడం జరిగిందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించడంతో టిపిసిసి ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ను డిసిసి అధికార ప్రతినిధిగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధులుగా నియమితులైన దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ను ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండెల రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మార్వో స్వర్ణను కలిసిన టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ సభ్యులు

- మండల సమస్యలపై వినతి.. పరిష్కారానికి హామీ



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 18, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వో స్వర్ణను టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లి వివరించారు. సమస్యలపై స్పందించిన ఎమ్మార్వో స్వర్ణ మండలంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుంజా వెంకట్, ఉపాధ్యక్షుడు వీర రాఘవులు, జనం సాక్షి ప్రజా జ్యోతి రిపోర్టర్ నున్న బుజ్జి కృష్ణ, ప్రజా దర్బార్ రిపోర్టర్ రమేష్, నవ భూమి రిపోర్టర్ వీరబోయిన సీతారాములు, ఉదయం పత్రిక రిపోర్టర్ ఆకుల శివ పాల్గొన్నారు.

# గోడిశాల రామనాథం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం



**పినపాక, ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా గోడిశాల రామనాథంను నియమించారు. పార్టీ బలోపేతం, కార్యక్రమాల విస్తరణలో ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రామనాథం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పినపాక మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఆయన కొనసాగుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలి






- మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ

**పాల్వంచ, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని 36 గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో మంజూరైన 737 మంది లబ్ధిదారుల గృహాలను త్వరితగతిన పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఎంపిడిఓ బొగ్గ నారాయణ మాట్లాడుతూ..గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచులతో అధికారులు సమన్వయం చేసుకుంటూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి గృహప్రవేశాల నిర్ణీత తేదీ నాటికి ఇండ్లు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ భవనాలు ప్రస్తుతం ప్రోగ్రెస్‌లో ఉన్నవాటిని కూడా నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈలు శ్రీ రమేష్, శ్రీమతి పుష్పలత, శ్రీమతి మీరాభి, ఏపిఎం శ్రీనివాసరావు, ఏఈఈ పి.ఆర్ చెన్నకేశవ రావు, ఎంపీవో, సర్పంచులు మరియు కార్యదర్శులు పాల్గొన్నారు.

# 14ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా తప్పనిసరి

- - డాక్టర్ కంచర్ల వెంకటేష్





**టేకులపల్లి, ఏప్రిల్ 18, ప్రజాజ్యోతి:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 ఏళ్ల బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్ టీకా ప్రత్యేక కార్యక్రమాన్ని వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నామని మండలం డాక్టర్ కంచర్ల వెంకటేష్ అన్నారు. శనివారం టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు గల 27 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. హెచ్‌పీవీ టీకా సింగిల్ డోస్ ఒక్కరికి 0.5 మి.లీ మోతాదు ఇవ్వబడుతుందన్నారు. ఎన్నో పరీక్షల అనంతరం అత్యంత సురక్షితమైన, ఖరీదైన ఈ వ్యాక్సిన్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బాలికలకు అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ వ్యాక్సిన్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ప్రతీ టీకా డోస్‌కు పూర్తి బాధ్యత ఉంటుందని, టీకా వృథా కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటారని అన్నారు. టీకా అనంతరం 30 నిమిషాలు పరిశీలనలో ఉంచడం తప్పనిసరి అన్నారు. టీకా తీసుకున్న బాలికల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి లైన్‌లిస్ట్ భద్రపరిచే విధంగా ఉంటుందని ఆయన తెలిపారు. సులానగర్ పీహెచ్‌సీలో ఈ వ్యాక్సిన్‌ను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌశల్య సింగ్, నాగలక్ష్మి, కమల, రమా కుమారి, సులోచెన, స్వప్న, చంద్రకళ, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, ఈఎంఆర్ఎస్ సిబ్బంది భవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

- లవ్ జీహాద్ ని భారత దేశం నుండి తరిమి కొట్టాలి
- విహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు సురేష్ కుమార్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 18,(ప్రజాజ్యోతి)** లవ్ జిహాద్ నీ భారతదేశం నుండి తరిమికొట్టాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా వి హెచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా అనేక నగరాలలో(నాసిక్, హైదరాబాదు, బెంగుళూరు, ఢిల్లీ, లక్నో) లవ్ జిహాద్ కేసులు నమోదవుతూ ఉన్నాయనీ, అమాయక హిందూ అమ్మాయిల్ని కార్యాలయాలు, కాలేజీలలో ముస్లిం యువకులు పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పి,మోసం చేసి పెళ్లి చేసుకుని వారి జీవితాలను చిన్న భిన్నం చేస్తూ లవ్ జిహాద్ కి పాల్పడుతున్నారనీ, అన్నారు ,ఇలాంటి సంఘటనల వల్ల లక్షలాదిమంది హిందూ మహిళలు వారి జీవితాలు ఆగం చేసుకోవడమే కాక కుటుంబాలతో సంబంధాలు కోల్పోతున్నారనీ, ఇదంతా ఉగ్రవాద మనస్తత్వం కలిగినటువంటి కొంతమంది జిహాదీ ముస్లింలు ప్రణాళిక ప్రకారం హిందూ అమ్మాయిలని లక్ష్యంగా చేసుకొని వారిని ప్రలోభ పెట్టి, మోసం చేసి, మూడో పెళ్లి_ నాలుగో పెళ్లి లు చేసుకుని వారి ఇంట్లో ఉన్నటువంటి కుటుంబ సభ్యులతో కూడా అత్యాచారం చేపిస్తూ.. హిందూ అమ్మాయిల పట్ల వికృతంగా ప్రవర్తిస్తున్నటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో దేశంలో అనేకం వెలుగు చూశాయన్నారు, స్త్రీని అత్యంత పవిత్రంగా ఆరాధించే భారతదేశంలో ఇలాంటి సంఘటనలు జరగటం చాలా దురదృష్టకరమని అన్నారు, ఇలాంటి లవ్ జీహాద్ సంఘటనల వల్ల హిందూ సమాజం బలహీనపడటమే కాక దేశ భద్రతకు చాలా ప్రమాదకరమని, కావున వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని భారతదేశం నుండి లవ్ జిహాద్ మూకల్ని తరిమికొట్టాలని డిమాండ్ చేశారు, అనంతరం బజరంగ్ దళ్ జిల్లా నాయకులు సాగర్ మాట్లాడుతూ.. లవ్ జీహాద్ పట్ల హిందూ అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలనీ, ముస్లిం అబ్బాయిల మోసపు మాటలు నమ్మరాదని అన్నారు, అనంతరం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ కి, జిల్లా కలెక్టర్ ద్వారా మొమెరాండం పంపిస్తూ కలెక్టర్ కార్యాలయం లోని పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు , విభాగ్ మాతృశక్తి సంయోజిక రేగడి విజయలక్ష్మి , విశ్వహిందూ పరిషత్ జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత , బజరంగ్దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్ దేవేందర్ , జిల్లా ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ వింజమూరు మురళి , జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ గొడ్ల రాజయ్య , పాల్వంచ ప్రఖండ ఉపాధ్యక్షులు చల్లా లింగన్న, పాల్వంచ కార్యదర్శి దాసరి మాధవరావు, పాల్వంచ సహ కార్యదర్శి వేములపల్లి ప్రవీణ్ , వెంకటరమణ , అగుల్ల యాకయ్య , జట్టి వెంకటేశ్వర్లు , ఆగుల్ల సుజాత, పలువురు విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు